అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు అర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడంపై అవగాహన కల్పించాలన్నారు. కొత్తగా ఓటరు గా నమోదు కోసం గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన వారు ఫారం 18 ద్వారా అన్ని వివరాలను నింపి గెజిటెడ్ అధికారి లేదా డిసిగ్నేటెడ్ అధికారి ద్వారా సంతకం చేసిన ధ్రువపత్రాన్ని సంబంధిత అధికారులకు సమర్పించాలన్నారు. 01/11/2023కంటే ముందు పట్టభద్రులైన వారు, ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలో స్థానిక నివాసులై ఉన్నవారు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. సమావేశం అనంతరం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో కొత్తగా ఓటరుగా నమోదుకు సంబంధించిన ఫారం 18 ద్వారా తన గ్రాడ్యుయేట్ వివరాలతో పూర్తి చేసిన ఓటరు నమోదు పత్రాన్ని ఈ.వి.శ్రీనివాస్ రావు జిల్లా అదనపు కలెక్టర్ రవి, ఆర్డీవో వెంకటేష్ లకు అందించారు. ఈ సమావేశంలో హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డీఎస్. వెంకన్న, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, వివిధ పార్టీల ప్రతినిధులు ఈ. వి. శ్రీనివాస్ రావు, రావు అమరేందర్ రెడ్డి, కుసుమ శ్యామ్ సుందర్, నాగబెల్లి రజినీకాంత్, ఎండీ నేహాల్, అంబాల ప్రశాంత్, బస్కె నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# 'సర్' గో బ్యాక్



**మొదటిపేజీ తరువాయి**

అంశంపై ఆయన మాట్లాడారు. తెలంగాణలో విద్యార్థి రాజకీయాల ప్రభావం తక్కువేనని రేవంత్ అన్నారు. లెఫ్ట్, రైట్ విద్యార్థి సంఘాలు ఉన్నప్పటికీ ఎన్ఎస్‌యూఐ ప్రభావం పెద్దగా లేదన్నారు. ఉత్తర, దక్షిణ భారతదేశాల్లో రాజకీయాల శైలి భిన్నంగా ఉంటుందని చెప్పారు. యూనివర్సిటీ, లా, ఆర్ట్స్ కాలేజీల్లో ఏబీవీపీలో గెలిచిన నేతలు తర్వాత కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన సందర్భాలున్నాయని తెలిపారు. విద్యార్థి రాజకీయాల్లో ఏబీవీపీ ప్రభావం ఉంటే.. రాజకీయాల్లో కాంగ్రెస్ ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. 2006లో జడ్పీటీసీ సభ్యుడిగా, 2007లో ఎమ్మెల్సీగా స్వతంత్ర అభ్యర్థిగా గెలిచానని రేవంత్ తెలిపారు. ఆ రెండు ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించానన్నారు. అప్పట్లో జిల్లాలో కాంగ్రెస్, టీడీపీ మాత్రమే ప్రధాన పార్టీలుగా ఉండేవని చెప్పారు. ప్రభుత్వంపై పోరాడాలంటే ప్రతిపక్షంలో ఉండటమే మేలని భావించి టీడీపీలో చేరానన్నారు. ఆ పార్టీ నుంచి 2009, 2014లో ఎమ్మెల్యేగా గెలిచినట్లు తెలిపారు. 2017లో కాంగ్రెస్‌లో చేరి.. 2019లో ఎంపీగా విజయం సాధించానని వివరించారు. రాష్ట్ర విభజన తర్వాత టీడీపీ నాయకత్వం ఆంధ్రప్రదేశ్‌లో ఉండటంతో తెలంగాణలో ఆ పార్టీ ప్రాధాన్యం తగ్గిందన్నారు. తెలంగాణలో టీడీపీతో కలిసి పనిచేయడం ఇబ్బందికరంగా ఉంటుందని ప్రజలు చెప్పడంతో కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. రాహుల్ గాంధీని కలిసిన తర్వాత 15 నిమిషాలు మాట్లాడానని.. అప్పుడే ఆయన తన నాయకుడని నిర్ణయించుకున్నానని చెప్పారు. తెలంగాణను కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ ఇచ్చారని రేవంత్ గుర్తుచేశారు. 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలున్న ఆంధ్రప్రదేశ్‌ను విభజించడం ద్వారా రాజకీయంగా నష్టం జరుగుతుందని తెలిసినా తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని పేర్కొన్నారు. 1200 మంది యువకుల త్యాగాలను, ప్రజల ఆకాంక్షలను గౌరవించి రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత కాంగ్రెస్‌కు రాజకీయ ప్రయోజనం కలగలేదని, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, ప్రజల ఆత్మగౌరవం కోసమే నిర్ణయం తీసుకున్నారని రేవంత్ చెప్పారు. తెలంగాణ ఏర్పాటుకు సంబంధించి కాంగ్రెస్ నిర్దేశించిన లక్ష్యాలను గత ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. అందుకే కాంగ్రెస్‌లో చేరానని తెలిపారు. బయటి నుంచి వచ్చిన వ్యక్తినైనా ఐదేళ్లలోనే కాంగ్రెస్ తనకు కార్యనిర్వాహక అధ్యక్ష పదవి, ఎంపీ, పీసీసీ అధ్యక్ష పదవులతో పాటు ముఖ్యమంత్రి అయ్యే అవకాశాన్ని కల్పించిందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు అక్షరాస్యత 12.5 శాతం కూడా లేదని రేవంత్ అన్నారు. పేదరికం, కరువు పరిస్థితుల్లో పండిట్ నెహ్రూ విద్య, సాగునీటి రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. ఐఐటీలు, ఐఐఎంలు, యూనివర్సిటీలు, సాగునీటి ప్రాజెక్టులు, గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల ఏర్పాటుకు పునాది వేశారని చెప్పారు. విద్య, వైద్యం, సాగునీటి రంగాల్లో దేశం క్రమంగా అభివృద్ధి చెందిందన్నారు. స్వాతంత్ర్య సమయంలో 33 ఏళ్లుగా ఉన్న సగటు ఆయుర్దాయం ఇప్పుడు 73 ఏళ్లకు చేరిందని తెలిపారు. అయితే చదువు పెరిగినా నాణ్యత లోపిస్తోందని, ఆహార ధాన్యాలు అందుబాటులో ఉన్నా పౌష్టికాహారం అందడం లేదని పేర్కొన్నారు. తెలంగాణలో విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చేందుకు విద్యా కమిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నిష్పత్తి దేశ సగటు కంటే మెరుగ్గా ఉన్నా.. ప్రతి ఏడాది 5060 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను వీడుతున్నారని చెప్పారు. ఇంగ్లిష్ మీడియం, నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ వంటి అంశాల్లో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటుతో పోటీ పడాల్సిన అవసరం ఉందన్నారు. యువతకు నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాలు అందించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తోందని రేవంత్ తెలిపారు. ఏటా రాష్ట్రం నుంచి సుమారు 1.80 లక్షల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు బయటకు వస్తున్నారని.. వారిలో కేవలం 20 వేల మందికే ఉద్యోగాలు వస్తున్నాయని చెప్పారు. మిగిలిన వారు తమ విద్యార్హతకు తగని ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితిని మార్చేందుకు 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సర్టిఫికెట్ల కోసం కాకుండా ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాల కోసం యువత చదవాలని సూచించారు. యూనివర్సిటీకి ఆనంద్ మహీంద్రా ఛైర్‌పర్సన్‌గా, శ్రీని రాజు వైస్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్పొరేట్ సంస్థల అధిపతులను డైరెక్టర్లుగా నియమించి.. పరిశ్రమలకు అవసరమైన కోర్సులను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. 1956లో ప్రారంభమైన ఐటీఐల్లో ఇప్పటికీ పాతకాలపు కోర్సులు కొనసాగుతున్నాయని రేవంత్ అన్నారు. డీజిల్ మెకానిక్ వంటి కోర్సులు ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా లేవని పేర్కొన్నారు. టాటా సంస్థతో ఒప్పందం చేసుకుని కొత్త నైపుణ్య శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణా వ్యయంలో టాటా సంస్థ 86 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 14 శాతం భరిస్తున్నాయని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

# కౌశిక్‌పై వేటు.. సులువేనా..?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో హుజూరాబాద్ నియోజకవర్గంపై తీవ్ర చర్చ జరుగుతోంది. సోమవారం నాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో కలకలం రేపాయి. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యవహారంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది మార్చి నెలలో జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో గనుల అక్రమాల చర్చ సందర్భంగా తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రసంగాన్ని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి గట్టిగా అడ్డుకున్నారు. నువ్వు ఏ పార్టీలో ఉన్నావంటూ ఆయనను నిలదీశారు. అంతటితో ఆగకుండా తీవ్ర పదజాలంతో దుర్భాషలాడారు. శ్రీహరిని అవమానపరిచేలా వ్యాఖ్యలు చేసి అభ్యంతరకర సైగలు చేశారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సభాపతికి ఫిర్యాదు చేశారు. ప్రజాప్రతినిధి ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దీనిని పరిగణించారు. ఈ వివాదాస్పద అంశాన్ని రేవూరి ప్రకాష్ రెడ్డి నేతృత్వంలోని ప్రివిలేజ్ అండ్ ఎథిక్స్ కమిటీ పరిశీలనకు పంపించారు. అసెంబ్లీ సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించిన కమిటీ కౌశిక్ రెడ్డి వివరణ కోరింది. పూర్తి వివరణ ఇచ్చేందుకు ఆయన ఆరు వారాల గడువు కోరారు. సభ్యత్వ రద్దు దిశగా కమిటీ అడుగులు వేస్తోందనే సంకేతాలు వెలువడుతున్నాయి. కౌశిక్ రెడ్డి వివరణతో సంతృప్తి చెందకపోతే సభ్యత్వ రద్దు చేయాలని కమిటీ సిఫారసు చేయవచ్చని తెలుస్తోంది. ఖైరతాబాద్ స్థానం మాదిరిగానే హుజూరాబాద్ సీటు కూడా ఖాళీ చేయించాలనేది కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది. అయితే ఇలాంటి వ్యవహారాలలో తప్పుకు తగినట్టుగా




క్రమశిక్షణా చర్యలు మాత్రమే ఉండాలని నిపుణులు చెబుతున్నారు. నేరుగా శాశ్వత బహిష్కరణ విధించడం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు గతంలో స్పష్టంచేసింది. 2025 ఫిబ్రవరి 25వ తేదీన బీహార్ ఎమ్మెల్సీ సునీల్ కుమార్ సింగ్ కేసులో అత్యున్నత న్యాయస్థానం చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. శాసనసభ తీసుకునే నిర్ణయాలకు కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో న్యాయ సమీక్ష నుంచి పూర్తి మినహాయింపు ఉండదని ధర్మాసనం తేల్చిచెప్పింది. తప్పు తీవ్రతకు మించి శాశ్వత బహిష్కరణలు చేయడం ఓటర్ల హక్కులను హరించడమేనని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో కౌశిక్ రెడ్డి సభ్యత్వంపై వేటు పడితే కోర్టుల్లో సవాలు చేసే అవకాశం పుష్కలంగా ఉంటుంది. గతంలో 2018 బడ్జెట్ సమావేశాల సమయంలోనూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్ కుమార్ లపై అప్పటి ప్రభుత్వం సభ్యత్వం రద్దు చేసింది. ఆ నిర్ణయాన్ని సవాలు చేస్తూ వారు హైకోర్టును ఆశ్రయించగా సింగిల్ బెంచ్ వారి సభ్యత్వాల రద్దును తప్పుబట్టింది. ఎమ్మెల్యేలుగా వారి సభ్యత్వాన్ని వెంటనే పునరుద్ధరించాలని కోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చింది. ఎమ్మెల్యేల బహిష్కరణ రాజ్యాంగ నిబంధనలకు పూర్తిగా విరుద్ధంగా ఉందని న్యాయస్థానం తేల్చిచెప్పింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఈ తీర్పుపై ప్రభుత్వం అప్పీల్ చేసినప్పటికీ డివిజన్ బెంచ్ కూడా అదే మాటను సమర్థించింది. ఈ చారిత్రాత్మక న్యాయపోరాటంలో కాంగ్రెస్ నేతలు ఘన విజయం సాధించారు. ఇప్పుడు అదే కోవలో పాడి కౌశిక్ రెడ్డి కూడా న్యాయపోరాటం చేసేందుకు సిద్ధమవుతున్నారు. పార్టీ ఫిరాయింపుల చట్టం అస్త్రంగా సుప్రీంకోర్టు వరకు పోరాడి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పై అనర్హత వేటు పడేలా బలమైన ఆధారాలు సంపాదించారు. కాగా ఇప్పుడు హుజూరాబాద్ ఎమ్మెల్యేను లక్ష్యంగా చేసుకుని ఎథిక్స్ కమిటీ ద్వారా ఉచ్చు బిగించాలని కాంగ్రెస్ చూస్తోంది. స్పీకర్ నిర్ణయం ఏదైనా సరే కౌశిక్ రెడ్డికి న్యాయస్థానాల తలుపు తట్టే పూర్తి రాజ్యాంగ హక్కు ఉంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 212 ప్రకారం చట్టసభల అంతర్గత వ్యవహారాల్లో కోర్టులు సాధారణంగా జోక్యం చేసుకోవు. కానీ ఆ నిర్ణయాలు సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఉంటే కోర్టులు జోక్యం చేసుకుంటాయి. మహారాష్ట్ర అసెంబ్లీలో అనుచిత ప్రవర్తన పేరుతో పన్నెండు మంది బీజేపీ ఎమ్మెల్యేలను ఏకంగా ఏడాది పాటు సస్పెండ్ చేయడాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. సస్పెన్షన్ అనేది కేవలం సంబంధిత సమావేశాలకే పరిమితం కావాలని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. కానీ తీవ్ర ఉల్లంఘనలు జరిగాయని న్యాయస్థానం భావిస్తే అనర్హత వేటు నుంచి కాపాడడం కోర్టులకు కూడా సాధ్యం కాదని న్యాయ నిపుణులు వివరిస్తున్నారు. పార్లమెంట్ చరిత్రలో 1951 నాటి ముద్గల్ కేసు మొదలుకుని 2023 నాటి మహువా మొయిత్రా వరకు పదిహేడు మంది సభ్యులు బహిష్కరణకు గురయ్యారు. అయితే అవినీతి, సభా ధిక్కారం, తీవ్ర ఆర్థిక నేరాల వంటి తిరుగులేని ఆధారాలు ఉన్న కేసుల్లో మాత్రమే ఇటువంటి కఠిన చర్యలు తీసుకున్నారు. కేవలం సభలో వాగ్వాదం, నిరసన వంటి చిన్న ఘటనలకు ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేయడం న్యాయస్థానాల విచారణలో నిలబడటం కష్టం. ఒకవేళ కాంగ్రెస్ వ్యూహం ప్రకారం ఎథిక్స్ కమిటీ సిఫారసుతో స్పీకర్ కౌశిక్ రెడ్డిపై వేటు వేస్తే ఆయన వెంటనే హైకోర్టు నుంచి స్టే తెచ్చుకోవచ్చు. దీనివల్ల హుజూరాబాద్ ఉప ఎన్నిక వస్తుందా లేదా అనేది ప్రస్తుతం రాష్ట్ర రాజకీయ వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రతి ఒక్కరి చూపు ఇప్పుడు అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ తుది నిర్ణయం వైపు అలాగే న్యాయస్థానాల వైపు నిలిచింది.

# టార్గెట్ లోకల్ ఎలక్షన్స్

**మొదటిపేజీ తరువాయి**

నుంచే సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, వరంగల్, ఖమ్మం, సిద్దిపేట మున్సిపాలిటీలలో పోటీ చేసి సత్తా చాటాలని ఆదేశించారు. ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాను పరిశీలించాలి. బూత్ స్థాయి కమిటీలను పటిష్ఠం చేసేందుకు వంద శాతానికి పైగా శ్రమించాలి. గ్రామాల్లో పర్యటించి నూట ఇరవై రోజుల్లో ప్రణాళికలు సిద్ధం చేయాలి. పార్టీ విజయం కోసం ప్రతి నాయకుడు పది నియోజకవర్గాల్లో ప్రత్యేక బృందాలతో పర్యటించాలి. యువతను భాగస్వామ్యం చేస్తూ 30 శాతం ఓట్లను సాధించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాద ఘటనపై పార్టీ వేగంగా స్పందించింది. ఐదుగురు చిన్నారులు మరణించిన ఈ దుర్ఘటనపై ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చింది. దీనితో ప్రభుత్వం అప్రమత్తమై కేవలం 24 గంటల్లోనే 11 కోట్ల రూపాయలను అత్యవసర నిధులుగా విడుదల చేసింది. బాధిత కుటుంబాలకు 5 లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సహాయాన్ని ప్రకటించేలా చేసింది. కలెక్టర్ సైతం ప్రత్యేక విచారణ జరిపి నూట యాభై పేజీల నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. రాష్ట్రంలో ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు వస్తే టీఆర్ఎస్ నేతలు తక్షణమే స్పందించాలని



సూచించారు. ఆసుపత్రి భద్రతా ప్రమాణాలపై 30 మంది నిపుణులతో తనిఖీలు నిర్వహించాలన్నారు. బాధితులకు అండగా నిలిచేందుకు 50 వేల మంది కార్యకర్తలను రంగంలోకి దింపాలని నిర్ణయించారు. నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వ పరంగా మరో 10 లక్షల రూపాయల పరిహారం అందేలా పోరాడతామని ప్రకటించారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు 80 శాతం నిధులను వైద్య రంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తెలంగాణ రక్షణ సేన క్షేత్రస్థాయిలో అడుగులు వేస్తోంది. రాబోయే ఎన్నికల్లో 30 శాతం కార్పొరేషన్ స్థానాలను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో ముందుకు వెళుతోంది. ఉమ్మడి జిల్లాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహించి 80 మంది ముఖ్య నేతలకు బాధ్యతలు అప్పగించారు. నియోజకవర్గాల అభివృద్ధి కోసం ప్రతి గ్రామానికి 50 లక్షల రూపాయల నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరనున్నారు. మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు 120 ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా 50 వేల ఉద్యోగాల కోసం పోరాటం చేయాలని నిర్ణయించారు. ప్రతి నియోజకవర్గంలో వంద మంది యువ నాయకులను తయారు చేసి ఎన్నికల బరిలోకి దింపనున్నారు. పార్టీ విధివిధానాలను ఇంటింటికి చేరవేయడానికి 10 వేల కరపత్రాలను ముద్రించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేందుకు 40 రోజుల పాటు ప్రత్యేక పాదయాత్రలు నిర్వహించనున్నారు. ప్రజా సంక్షేమమే ప్రధాన అజెండాగా సాగుతున్న ఈ ప్రయాణంలో ప్రతి కార్యకర్త క్రియాశీలక పాత్ర పోషించాలి. రాష్ట్రంలోని ప్రతి మున్సిపాలిటీలోనూ పార్టీ జెండా ఎగరవేయడమే ధ్యేయంగా నేతలు శ్రమిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 150 డివిజన్లలో ప్రత్యేక వ్యూహాలను అమలు చేస్తున్నారు. ప్రతి డివిజన్‌కు ఐదు మంది సీనియర్ నాయకులను పరిశీలకులుగా నియమించి పర్యవేక్షణ పెంచారు. స్థానిక సమస్యలను గుర్తించి 180 గంటల్లో పరిష్కరించేలా ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడానికి 30 ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి.

# గేటెడ్ కమ్యూనిటీలపై దొంగల కన్ను!



- రాత్రివేళ భద్రతపై చందానగర్ పోలీసుల అప్రమత్తత
- అనుమానాస్పద కదలికలపై వెంటనే సమాచారం ఇవ్వాలని సూచన

సైబరాబాద్ - విశాల భారతి

గేటెడ్ కమ్యూనిటీల్లో వరుస చోరీల నేపథ్యంలో చందానగర్ పోలీసులు అప్రమత్తమయ్యారు. నార్సింగి, పోచారం పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాత్రి వేళ ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలు జరిగిన నేపథ్యంలో చందానగర్ పరిధిలోని అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, దుకాణాలు, మాల్స్ యాజమాన్యాలను పోలీసులు హెచ్చరించారు.ఈ నెల 27న తెల్లవారుజామున 2.56 నుంచి 4.46 గంటల మధ్య నార్సింగి పరిధిలోని ఫ్లోటిల్లా గేటెడ్ అపార్ట్‌మెంట్స్‌లోని సీబ్లాక్ 403వ ఫ్లాట్‌లో చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు అపార్ట్‌మెంట్ ప్రహరీ ఫెన్సింగ్‌ను కట్ చేసి లోపలికి ప్రవేశించి, ఫ్లాట్ తాళం పగులగొట్టి ఇంట్లోని నగదు, విలువైన వస్తువులను అపహరించారు. ఈ నెల 23న పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ ఇదే తరహాలో ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు.

**పగలు రెక్కీ.. రాత్రి చోరీ**

పగటిపూట పరిసరాలను పరిశీలించి, రాత్రి సమయంలో ఇళ్లను లక్ష్యంగా చేసుకునే ముఠా సంచరిస్తున్నట్లు ప్రాథమిక సమాచారం ఉందని పోలీసులు పేర్కొన్నారు. ధార్, భీల్ గ్యాంగ్‌లకు చెందినవారిగా అనుమానం ఉన్నప్పటికీ, దీనిపై దర్యాప్తు కొనసాగుతోందని స్పష్టం చేశారు.ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో పొరుగువారికి, సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇంట్లో నగదు, విలువైన వస్తువులను ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచాలని, అన్ని తలుపులు, కిటికీలు, బాల్కనీలు, టెర్రస్ ప్రవేశ మార్గాలను పటిష్ఠంగా లాక్ చేసుకోవాలని తెలిపారు. ఇంటి నాలుగు వైపులా కవరయ్యేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సెక్యూరిటీ సిబ్బంది రాత్రివేళ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ఆదేశించారు. ఎంట్రీ రిజిస్టర్‌ను తప్పనిసరిగా నిర్వహిస్తూ రాత్రి వేళ వచ్చే వ్యక్తులు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని తెలిపారు. రాత్రి 11 నుంచి ఉదయం 5 గంటల వరకు చీకటి, నిర్మానుష్య ప్రాంతాల్లో గస్తీ పెంచాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

**సమాచారం ఇవ్వాల్సిన నంబర్లు:**

చందానగర్ పోలీస్‌స్టేషన్ - 8712663189, ఎస్సై శ్రీనివాస్ తేజ - 8712663185, ఎస్సై రాధిక - 8712663183, ఎస్‌హెచ్ఓ - 8712663180, పెట్రోల్ మొబైల్ - 8712680293, 8712680294. అత్యవసర పరిస్థితుల్లో 112కు సమాచారం ఇవ్వాలని చందానగర్ ఎస్‌హెచ్ఓ ఎ. శ్రీధర్ కుమార్ కోరారు.





కుంట్లూర్ గ్రామంలోని మంజునాథ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన భారీ గణనాధుడి లడ్డు ప్రసాదాన్ని వేలం పాటలో. 1,22,222 రూపాయలకు కైవసం చేసుకున్న చామ అను కిరణ్ రెడ్డి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు..

- విశాల భారతి, పెద్ద అంబర్పేట్

# వసతి గృహాల్లో విద్యార్థుల భద్రతకు పెద్దపీట

**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యతో పాటు మౌలిక వసతులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వసతి గృహాలను క్రమం తప్పకుండా ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు. రాష్ట్రంలోని పాఠశాల విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల పరిధిలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో సంజయ్ జాజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. మహబూబాబాద్ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

**ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు**

రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఆహారం తయారీ, ఆహార పదార్థాల నిల్వ, వినియోగంలో నిర్దేశిత ప్రామాణిక నిర్వహణ విధానాలను తప్పనిసరిగా పాటించాలని సీఎస్ స్పష్టం చేశారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, పారిశుధ్యం, వంటశాలల నిర్వహణపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో ఫుడ్ పాయిజనింగ్, ఎలుకలు, పాముకాటు వంటి ఘటనలు చోటు చేసుకున్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

**హాజరు.. మౌలిక వసతులపై నిఘా.**

ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును నిరంతరం పర్యవేక్షించాలని, వసతి గృహాల్లో మౌలిక వసతుల లోపాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సీఎస్ తెలిపారు. సాధ్యమైన చోట్ల వంటశాలల ఆధునీకరణ పనులను త్వరితగతిన చేపట్టాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడికి అవసరమైన శిక్షణ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



**డ్యాష్‌బోర్డ్, పోర్టల్‌లో వివరాలు అప్‌డేట్ చేయాలి.**


రెసిడెన్షియల్ విద్యాసంస్థల క్షేత్రస్థాయి పరిస్థితులను పర్యవేక్షించేందుకు రూపొందించిన డ్యాష్‌బోర్డ్‌ను కలెక్టర్లు క్రమం తప్పకుండా పరిశీలించాలని సంజయ్ జాజు సూచించారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయా? ఎక్కడైనా లోపాలు ఉన్నాయా? అనే అంశాలను పరిశీలించి, వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో చేపట్టిన మార్పులు, సమస్యల పరిష్కార చర్యలను కూడా పోర్టల్‌లో నిరంతరం అప్‌డేట్ చేయాలని తెలిపారు.

**చలికాలానికి ముందే ఏర్పాట్లు**

రానున్న శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు స్నానానికి వెచ్చని నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. అవసరమైన దుప్పట్లను ముందుగానే సమకూర్చాలని సూచించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న రెసిడెన్షియల్ విద్యాసంస్థల భవన యజమానులతో కలెక్టర్లు సమావేశమై అవసరమైన మార్పులు, మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**దసరా నాటికి రెండు జతల యూనిఫారాలు**

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రతిరోజూ ఒక లక్ష యూనిఫారాలు కుట్టేలా చర్యలు చేపట్టాలని సంజయ్ జాజు అన్నారు. దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. యూనిఫాం క్లాత్ ఇప్పటికే జిల్లాలకు చేరినందున కుట్టు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.



**123 వసతి గృహాలపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి**

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర సంక్షేమ శాఖలకు సంబంధించిన 123 వసతి గృహాల నిర్వహణలో పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.

**ఫిర్యాదుల బాక్సులు తప్పనిసరి**

ప్రతి వసతి గృహంలో ఫిర్యాదుల బాక్సులను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రత్యేక అధికారులు ప్రతిరోజూ వసతి గృహాలను సందర్శిస్తూ.. బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ సమయాల్లో విద్యార్థులకు అందుతున్న ఆహారాన్ని పరిశీలించాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అన్నది తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

**విద్యార్థుల మానసిక స్థితిపై ప్రత్యేక శ్రద్ధ**

వసతి గృహాల్లోని విద్యార్థుల మానసిక స్థితిగతులను కూడా అధికారులు ఎప్పటికప్పుడు గమనించాలని కలెక్టర్ తెలిపారు. అవసరమైన చోట వైద్యుల ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. వసతి గృహాల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా తనకు ఫోన్ లేదా మెసేజ్ ద్వారా సమాచారం అందించాలని ఆర్‌సీఓలు, డీసీఓలకు సూచించారు. సంక్షేమ వసతి గృహాల పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, బుష్ క్లియరెన్స్ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం లేకుండా అన్ని హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అన్ని సంక్షేమ శాఖల అధికారులు, ప్రత్యేక అధికారులు సమన్వయంతో పనిచేసి వసతి గృహాలను క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ప్రతి వసతి గృహాన్ని అధికారులు సందర్శించి మౌలిక సదుపాయాల ప్రస్తుత పరిస్థితిని పరిశీలించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా లేదా అన్న అంశాన్ని తనిఖీ చేసి ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), హౌసింగ్ పీడీ పురుషోత్తం, మైనారిటీ సంక్షేమ అధికారి, డీఆర్ఓ నాగలక్ష్మి, ఇంటర్మీడియట్ అధికారి మదర్, ఇన్‌చార్జి డీఈఓ శ్రీరాములు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారులు దేశీరామ్ నాయక్, శ్రీనివాసరావు, అన్ని విభాగాల ఆర్‌సీఓలు, డీసీఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అదృశ్యమైన గ్లాస్ వర్క్ కాంట్రాక్టర్

- బకాయిల కోసం బయలుదేరి.. బందీ అయ్యాడా?
- నాలుగు రోజులుగా కనిపించని అవదేష్‌కుమార్
- మాదాపూర్ పోలీసుల దర్యాప్తు

సైబరాబాద్ - విశాల భారతి



రూ.5 లక్షల బకాయిల వ్యవహారం ఓ లేబర్ కాంట్రాక్టర్ అదృశ్యానికి దారితీసిందా? గ్లాస్ వర్క్ డబ్బులు తీసుకునేందుకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన బీహార్‌కు చెందిన అవదేష్‌కుమార్ (29) నాలుగు రోజులుగా కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.సిద్ధిక్‌నగర్‌లో నివాసముంటున్న అవదేష్‌కుమార్ గత ఏడాది కాలంగా గ్లాస్ వర్క్ లేబర్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. గతంలో ఫోనెక్స్ కంపెనీ వద్ద చేసిన పనులకు సుమారు రూ.5 లక్షలు రావాల్సి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 24న ఉదయం ఆ బకాయిల కోసం ఫోనెక్స్ కంపెనీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. అయితే రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు. కంపెనీలో విచారించగా.. ఆ రోజు అవదేష్ అక్కడికి రాలేదని సిబ్బంది చెప్పినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.దీంతో అతని సోదరుడు మిథిలేష్‌కుమార్ సోమవారం మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అవదేష్ ఎత్తు సుమారు 5.5 అడుగులు, గోధుమ వర్ణంతో ఉంటాడని, హిందీ, మైథిలి భాషలు మాట్లాడతాడని వివరాలు అందజేశాడు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఇంటి నుంచి బయలుదేరిన అనంతరం అవదేష్ ఎక్కడికి వెళ్లాడు? ఫోనెక్స్ కంపెనీకి వెళ్లకపోతే ఎక్కడికి వెళ్లాడు? చివరిసారిగా ఎక్కడ కనిపించాడు? అనే కోణాల్లో పోలీసులు ఆరా తీస్తున్నారు. అతని ఆచూకీ కోసం పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టడంతో పాటు అందుబాటులో ఉన్న సమాచారాన్ని పరిశీలిస్తున్నారు. అవదేష్ జాడ కోసం పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

# ఏఐ టెక్నాలజీకి హైదరాబాద్ కేంద్రంగా ఎదుగుతోంది



- బిల్‌ట్రస్ట్ జీసీసీ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు
- పెట్టుబడులకు ప్రభుత్వ సహకారం

సైబరాబాద్ - విశాల భారతి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత సాంకేతిక రంగంలో హైదరాబాద్ తన అవకాశాలను మరింత విస్తరించుకుంటోందని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. అంతర్జాతీయ సాంకేతిక సంస్థలకు హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా మారుతోందని పేర్కొన్నారు. మాదాపూర్ రహేజా మైండ్‌స్పేస్‌లో బీ2బీ క్యాష్ జనరేషన్ ప్లాట్‌ఫామ్ బిల్‌ట్రస్ట్ ఏర్పాటు చేసిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను సోమవారం ఆయన ప్రారంభించారు.సుమారు 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో ప్రస్తుతం 100 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. రానున్న మూడేళ్లలో రూ.450 కోట్ల పెట్టుబడులు పెట్టడంతోపాటు సిబ్బంది సంఖ్యను వెయ్యికి పెంచాలని బిల్‌ట్రస్ట్ లక్ష్యంగా పెట్టుకుంది. ఏఐ, ఇంజినీరింగ్, టెక్నాలజీ, ఆపరేషన్స్ విభాగాల్లో అధునాతన సామర్థ్యాలను అభివృద్ధి చేయనుంది. బిల్‌ట్రస్ట్ అంతర్జాతీయ కార్యకలాపాలకు హైదరాబాద్ కేంద్రం కీలకంగా మారనుంది.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తెలంగాణలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన యువత రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో అందుబాటులో ఉన్నారని చెప్పారు. టీ-హబ్, టాస్క్ వంటి సంస్థల ద్వారా సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. హైదరాబాద్‌లో నైపుణ్యవంతమైన మానవ వనరులు, బలమైన సాంకేతిక పర్యావరణ వ్యవస్థ ఉండటంతోనే జీసీసీ ఏర్పాటుకు నగరాన్ని ఎంపిక చేసినట్లు బిల్‌ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. కేవలం ఆరు నెలల్లోనే 100 మంది ఉద్యోగులతో కార్యకలాపాలు ప్రారంభించడం హైదరాబాద్‌లోని సాంకేతిక ప్రతిభకు నిదర్శనమన్నారు.ప్రపంచవ్యాప్తంగా బీ2బీ రంగానికి సేవలందిస్తున్న బిల్‌ట్రస్ట్ హైదరాబాద్ కేంద్రం ద్వారా ఏఐ, డేటా, క్యాష్ జనరేషన్ టెక్నాలజీల అభివృద్ధిపై దృష్టి సారించనుంది. భారీ పెట్టుబడులతో పాటు రానున్న రోజుల్లో వెయ్యి వరకు ఉద్యోగాలు అందుబాటులోకి తీసుకురావాలనే సంస్థ ప్రణాళిక హైదరాబాద్ టెక్నాలజీ రంగానికి మరింత ఊతమివ్వనుంది.

# కొండాపూర్‌లో గిగ్ కార్మికులకు ఆశ్రయ

- డెలివరీ కార్మికులకు విశ్రాంతి.. ప్రాథమిక వసతులు
- సీఎంసీ కమిషనర్ శ్రీజన ప్రారంభం
- ప్రభుత్వం–అమెజాన్ ఇండియా భాగస్వామ్యంతో ఏర్పాటు

సైబరాబాద్ - విశాల భారతి




నగర జీవనంలో కీలకంగా మారిన గిగ్, డెలివరీ కార్మికుల సంక్షేమానికి మరో అడుగు పడింది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొండాపూర్‌లో గిగ్, డెలివరీ కార్మికుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'ఆశ్రయ' కేంద్రాన్ని సీఎంసీ కమిషనర్ ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం, అమెజాన్ ఇండియా భాగస్వామ్యంతో ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. పని ఒత్తిడి మధ్య రహదారులపై నిరంతరం తిరిగే డెలివరీ కార్మికులకు కొద్దిసేపు సేదతీరేందుకు, అవసరమైన ప్రాథమిక సౌకర్యాలను వినియోగించుకునేందుకు ఈ కేంద్రం ప్రత్యేక వేదికగా నిలవనుంది.నగరంలో ఆహారం, మందులు, వస్తువులు, ఇతర అత్యవసర సేవలను ప్రజల ఇంటి గడపకు చేరవేయడంలో గిగ్ కార్మికుల పాత్ర రోజురోజుకూ పెరుగుతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు వాతావరణ పరిస్థితులతో సంబంధం లేకుండా రహదారులపై ప్రయాణిస్తూ వారు ఒక డెలివరీ పూర్తయిన వెంటనే మరో ఆర్డర్ కోసం పరుగులు తీస్తుంటారు. అయితే, పని మధ్యలో కొంతసేపు ఆగి విశ్రాంతి తీసుకునేందుకు, తాగునీరు వంటి ప్రాథమిక అవసరాలు తీర్చుకునేందుకు వారికి ప్రత్యేక వసతులు చాలా పరిమితంగా ఉన్నాయి. ఈ సమస్యకు కొంతమేర పరిష్కారం చూపేలా 'ఆశ్రయ' కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

**అన్ని డెలివరీ ప్లాట్‌ఫామ్‌ల కార్మికులకూ..**

కొండాపూర్‌లో ఏర్పాటు చేసిన 'ఆశ్రయ' కేంద్రం ఒకే సంస్థకు చెందిన డెలివరీ సిబ్బందికి పరిమితం కాదు. వివిధ గిగ్, డెలివరీ ప్లాట్‌ఫామ్‌లలో పనిచేసే కార్మికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు. వారు ఏ కంపెనీకి చెందినవారైనా కేంద్రంలో కొంతసేపు విశ్రాంతి తీసుకునే అవకాశం ఉంటుంది. దీంతో నగరంలో విస్తృతంగా పనిచేస్తున్న గిగ్ వర్కర్లకు ఈ కేంద్రం ఉపయోగపడనుంది.

**పని మధ్యలో కాసేపు సేదతీరేందుకు..**

డెలివరీ ఉద్యోగుల రోజువారీ పని తీరు ఇతర ఉద్యోగాలతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. నిర్ణీత కార్యాలయంలో కాకుండా నగరంలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ట్రాఫిక్, ఎండ, వర్షం వంటి పరిస్థితులను ఎదుర్కొంటూ గంటల తరబడి వాహనాలపై ప్రయాణించాల్సి వస్తుంది. ఇలాంటి సమయంలో పని మధ్యలో కొంతసేపు ఆగి శారీరకంగా, మానసికంగా సేదతీరేందుకు 'ఆశ్రయ' కేంద్రం ఉపయోగపడనుంది.కేంద్రంలో కార్మికులు కొంతసేపు ఆగడం, విశ్రాంతి తీసుకోవడం, తమ ఫోన్లు లేదా ఇతర పరికరాలను రీఛార్జ్ చేసుకోవడం వంటి అవసరాలు తీర్చుకునే అవకాశం ఉంటుంది. పని మధ్యలో ఎదురయ్యే చిన్నచిన్న ఇబ్బందులకు కేంద్రం ఒక ఉపశమనంగా నిలవనుంది.

**నగరవ్యాప్తంగా విస్తరణకు ప్రణాళిక..**

హైదరాబాద్ నగరవ్యాప్తంగా గిగ్, డెలివరీ కార్మికులకు అందుబాటులో ఉండేలా 'ఆశ్రయ' కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగంగానే కొండాపూర్ కేంద్రాన్ని ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం, అమెజాన్ ఇండియా మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం ప్రకారం ఈ కార్యక్రమం ముందుకు సాగుతోంది. గిగ్ కార్మికులు ఎక్కువగా రాకపోకలు సాగించే, సులభంగా చేరుకోగల ప్రాంతాల్లో ఇలాంటి కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నారు.మెట్రోపాలిటన్ ఏరియా, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ మార్గదర్శకత్వంలో ఆశ్రయ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. నగర విస్తరణతో పాటు ఆన్‌లైన్ ఆర్డర్లు, ఇంటి వద్దకే సేవలు పెరుగుతున్న నేపథ్యంలో గిగ్ కార్మికులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నారు.




**నగరాన్ని నడిపించే 'గిగ్' సిబ్బంది**

ఆన్‌లైన్ వాణిజ్యం, ఫుడ్ డెలివరీ, కిరాణా సరుకులు, ఇతర సేవల రంగాల విస్తరణతో గిగ్ కార్మికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. నగరంలోని వేలాది కుటుంబాలకు అవసరమైన వస్తువులు, ఆహారం, ఇతర సేవలను నిర్ణీత సమయంలో అందించడంలో వీరి సేవలు కీలకంగా మారాయి. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి నిరంతరం ప్రయాణిస్తూ ప్రజల అవసరాలను తీర్చే వీరికి పని ప్రదేశమే నగర రహదారులుగా మారిపోయింది .ఈ నేపథ్యంలో కేవలం డెలివరీ వేగం, సేవలపైనే కాకుండా కార్మికుల సంక్షేమం, పని పరిస్థితులపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్న ఉద్దేశంతో 'ఆశ్రయ' కేంద్రాల ఏర్పాటు చేపడుతున్నారు. పని మధ్యలో కాసేపు ఆగేందుకు ఒక సురక్షితమైన, అనుకూలమైన స్థలం అందుబాటులో ఉండటం గిగ్ కార్మికులకు ఉపయోగకరంగా మారనుంది.

**సీఎంసీ పరిధిలో మరింత ప్రాధాన్యం..**

సైబరాబాద్ ప్రాంతంలో ఐటీ సంస్థలు, వాణిజ్య సముదాయాలు, గేటెడ్ కమ్యూనిటీలు, నివాస ప్రాంతాలు పెద్ద సంఖ్యలో ఉండటంతో డెలివరీ సేవలకు విస్తృత డిమాండ్ ఉంది. ముఖ్యంగా కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్, కండాపూర్ పరిసర ప్రాంతాల్లో రోజువారీగా పెద్ద సంఖ్యలో డెలివరీ కార్మికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో 'ఆశ్రయ' కేంద్రం అందుబాటులోకి రావడం కార్మికులకు ఉపయోగపడే చర్యగా భావిస్తున్నారు. గిగ్ కార్మికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్‌లో మరిన్ని ప్రాంతాల్లో ఇలాంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా కార్మికులకు అనుకూలమైన నగర వాతావరణాన్ని రూపొందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా అధికారులు పేర్కొంటున్నారు. గిగ్ కార్మికులు నగర ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములుగా మారడంతో వారి కనీస అవసరాలకు తగిన సౌకర్యాలు కల్పించడం కూడా పట్టణ ప్రణాళికలో భాగం కావాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా 'ఆశ్రయ' కేంద్రాల ఏర్పాటు ప్రారంభ దశలోనే ఉన్నప్పటికీ, పని మధ్యలో కార్మికులకు విశ్రాంతి, ప్రాథమిక సౌకర్యాలు అందించే వ్యవస్థకు ఇది నాంది కానుంది.

# సీఎం రేవంత్ గౌడ్ చిత్ర పటానికి ఎంఆర్పీఎస్ పిండ ప్రదానం

- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఎంఎల్సీ పదవికి రాజీనామా చేయాలి
- ఆర్మూర్‌లో ఎంఆర్పీఎస్ వినూత్న నిరసన




**విశాల భారతి, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం రోజు సీఎం చిత్రపటానికి, వీడీసీ ల చిత్ర పటాలకు ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో పిండ ప్రదానాలు చేశారు. అనంతరం ఎంఆర్పీఎస్ ఆర్మూర్ ఇంచార్జ్ మైలారం బాలు మాదిగ మాట్లాడుతూ, ఏర్గట్ల మండలం తాళ్ల రాంపూర్ గ్రామంలో ఈ నెల 22నాడు 39 గౌడ కుటుంబాలను 10 ఎస్సీ గీత కార్మిక కుటుంబాలను సాంఘిక బహిష్కరణ చేయడం చాలా బాధాకరం అన్నారు. దానికి నిరసనగా నేడు రేవంత్ రెడ్డి, చిత్రపటానికి రేవంత్ గౌడ్, అని ఎందుకు పెట్టాం అంటే మొన్న హైదరాబాద్ లో సర్వాయిపాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ లో ఎంఎల్సీ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మాట్లాడుతూ మా సీఎం రేవంత్ గౌడ్ అని మాట్లాడినారు సీఎం ను గౌడ్లతో పిలిచిన మీరు మీ సొంత జిల్లాలో గౌడ కులస్తులను, ఎస్సీ లను సాంఘిక బహిష్కరణ చేస్తే మీరు మీ ప్రభుత్వం ఉండి కూడా దండగ అని, తక్షణం సాంఘిక బహిష్కరణకు బాధ్యత వహించాలని, మీరు రాజీనామా చేయాలని ఎంఆర్పీఎస్ డిమాండ్ చేస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, గౌడ కులస్తుల గురించి సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణలో గొప్పగా మాట్లాడిన మాటలన్నీ రాజకీయ లబ్ది కోసమే అని అనిపిస్తుందన్నారు. వారిని సాంఘిక బహిష్కరన చేస్తే మీ ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నిరేతన్నట్టు ఉంది అని, గౌడ కులస్తులు ప్రభుత్వం మీద పోరాటం చేయాలన్నారు. గౌడ కులస్తులకు ఎంఆర్పీఎస్ మందకృష్ణ, మాదిగ అండగా ఉంటారని తెలియజేస్తున్నాం అన్నారు. గ్రామాభివృద్ధి కమిటీలు రజాకారులను తలపిస్తున్నాయి అని అన్నారు. తక్షణం గ్రామాభివృద్ధి కమిటీ లను అణిచివేయాలని లేని యెడల ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మ శ్రీ మందకృష్ణ, మాదిగ దృష్టికి తీసుకెళ్తాం, ప్రత్యక్ష కార్యాచరణ ద్వారా ఉద్యమాన్ని కొనసాగిస్తాం అన్నారు. గౌడ కులస్తులకు ఎంఆర్పీఎస్ అండగా ఉంటుంది అని గౌడ కులస్థులూ కూడా వినతి పత్రాలు కాకుండా సర్వాయి పాపన్న గౌడ్ వారసులుగా ఉద్యమాలను కొనసాగించాలన్నారు. 24 గంటల్లో బహిష్కరణ ఎత్తివేయకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏంఎస్ఎఫ్ ఇంచార్జ్ మైలారం రాము, తరుణ్, కిరణ్, మార్క్, అశోక్, విప్లవ్, సాయన్న, బోట్ల గంగారం, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.




# SIR అక్రమాలపై కాంగ్రెస్ నిరసన

- **కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీనామా చేయాలి : పోచబోయిన సురేష్ యాదవ్**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు మహేశ్వరం నియోజకవర్గంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోచబోయిన సురేష్ యాదవ్ పాల్గొన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (SIR) ప్రక్రియకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలపై నిరసన వ్యక్తం చేస్తూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సురేష్ యాదవ్ మాట్లాడుతూ.. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు పూర్తి విశ్వాసం కలిగేలా కేంద్ర ఎన్నికల సంఘం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి తలెత్తుతున్న అనుమానాలు, అభ్యంతరాలపై ఎన్నికల సంఘం స్పష్టమైన వివరణ ఇవ్వాలని అన్నారు. SIR ప్రక్రియపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు వ్యక్తం చేసిన అభ్యంతరాలపై కూడా ఎన్నికల సంఘం సమగ్రంగా వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎస్సీ సెల్, బీసీ సెల్ నాయకులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మైదానంలో అబ్దుల్లాపూర్‌మెట్ హవా!

- **ఖోఖో.. కబడ్డీ.. వాలీబాల్‌లో జోనల్ విజేతలుగా దూసుకెళ్లిన బాలురు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** హయత్‌నగర్ జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి చెందిన అండర్-14 బాలుర జట్లు సత్తా చాటాయి. 70వ ఎస్‌జీఎఫ్ఐ హయత్‌నగర్ జోనల్ లెవల్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్‌లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ మూడు క్రీడాంశాల్లోనూ అబ్దుల్లాపూర్‌మెట్ జట్లు ప్రథమ స్థానాలు సాధించి జోనల్ విజేతలుగా నిలిచాయి. హయత్‌నగర్ జట్లు మూడు క్రీడాంశాల్లో ద్వితీయ స్థానాలను దక్కించుకున్నాయి. హయత్‌నగర్‌లోని ఎన్‌వైఎన్‌వైఎస్ యాదవ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ మండల విద్యాధికారి శ్రీనివాస్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల విద్యాధికారి జగదీష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, హయత్‌నగర్ జోనల్ సెక్రెటరీ నిర్మల, విజేతలకు బహుమతులు, భోజన వసతి కల్పించిన నక్క శ్రీనివాస్ యాదవ్, తెలంగాణ టీజీపీఈటీఏ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సాబేర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు. ఫిజికల్ డైరెక్టర్లు జగన్మోహన్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, స్వాములు, నరసింహారావు, చంద్రమోహన్, వెంకటేష్, గోపాల్ సింగ్, నీలేష్, సాయిరాం, సంపత్, ముత్యం, మధు, రమేష్, నవ్య తదితరులు పోటీల నిర్వహణలో పాల్గొన్నారు.

### విజేతల వివరాలు:

**ఖోఖో:** ప్రథమ స్థానం - అబ్దుల్లాపూర్‌మెట్; ద్వితీయ స్థానం - హయత్‌నగర్.
**కబడ్డీ:** ప్రథమ స్థానం - అబ్దుల్లాపూర్‌మెట్; ద్వితీయ స్థానం - హయత్‌నగర్.
**వాలీబాల్:** ప్రథమ స్థానం - అబ్దుల్లాపూర్‌మెట్; ద్వితీయ స్థానం - హయత్‌నగర్.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం

- **ధర్మచక్రం గుర్తుకు ఓటు వేయండి**
- **తెలంగాణ ఆర్టీసీ బహుజన కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రాజిరెడ్డి, కత్తుల యాదయ్య**



**ముషీరాబాద్, విశాల భారతి:** ఆర్టీసీ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని అందుకు ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల్లో ధర్మ చక్రం గుర్తుకు ఓటు వేయాలని తెలంగాణ ఆర్టీసీ బహుజన కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రాజిరెడ్డి, కత్తుల యాదయ్య ఆర్టీసీ కార్మికులను కోరారు. ఈ మేరకు సీబీఎస్ చేంజ్ ఓవర్ పాయింట్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్మికులను ఉద్దేశించి వారు మాట్లాడారు. విలీన ప్రక్రియ కార్మికుల హక్కులు ఉద్యోగ భద్రత వేతన సవరణకై తమ యూనియన్ మొదటి ప్రాధాన్యత తీసుకుంటుందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా బహుజన కార్మిక యూనియన్ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మురం చేసిందని కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, వేతనాలు, పని భారం, పదోన్నతులు, ప్రమాద కేసులు, రిటైర్మెంట్ బకాయిలకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని చెప్పారు. అంతేకాకుండా ప్రయాణికుడు టికెట్ తీసుకోవడం ప్రయాణం పూర్తయ్యే వరకు ఆ టికెట్ ను భద్రపరచుకోవడం ప్రయాణికుడు బాధ్యతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని యూనియన్ తరపున కోరడం జరిగిందని తెలిపారు. ఆర్టీసీ నియామావళి లో ఉన్న రిమూవల్ వంటి కఠిన చర్యలకు అవకాశం లేకుండా చేయడమే తమ యూనియన్ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి బుద్ధ విశాల్, యాదగిరి, పర్వతాలు, శంకర్, బి యాదయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# పద్మారావు నగర్‌లో టిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ



**సికింద్రాబాద్, విశాల భారతి :** పద్మారావు నగర్ లో టీఆర్ఎస్ పార్టీ జండా ను నాయకులు ఆవిష్కరించారు. ఆ పార్టీ నాయకురాలు కడెం అర్చన ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు .కేక్ కట్ చేసి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కడెం అర్చన మాట్లాడుతూ....... తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక కవిత అన్నారు. ఆమె నాయకత్వంలో టిఆర్ఎస్ పార్టీ మరింత బలంగా ప్రజల్లోకి వెళ్తుంది అన్నారు. మహిళల కోసం, తెలంగాణ జాగృతి కోసం కవిత చేస్తున్న పోరాటం స్ఫూర్తిదాయకం అని, కవిత ఆశయాలను పద్మారావు నగర్ లోని ప్రతి ఇంటికి తీసుకెళ్తాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళా నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- **స్వయంగా జారిపడటమా.. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిందా**

**రాజేంద్రనగర్, విశాల భారతి:** శంషాబాద్ రాళ్లగూడ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. రాయల్ విల్లాస్‌కు చెందిన కర్ల చంద్రశేఖర్ చౌదరి (30) ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. తెల్లవారుజామున సుమారు 2.20 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై రాళ్లగూడ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులోని స్క్రాప్ దుకాణం ఎదురుగా వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదంలో చంద్రశేఖర్ చౌదరి ముక్కుకు రక్తగాయం కాగా, నుదుటిపై స్వల్ప గాయమైంది. అనంతరం ఆయన మృతి చెందాడు. డయల్ 112కు సమాచారం అందడంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య సిగళ్లపల్లి కుమారి ఆర్జీఐ విమానాశ్రయ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. చంద్రశేఖర్ స్వయంగా జారిపడటం వల్ల ప్రమాదం జరిగిందా, గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిందా, లేక మరేదైనా కారణం ఉందా అనే అనుమానాలను ఆమె వ్యక్తం చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి అసలు కారణం ఏమిటన్నది తేల్చేందుకు పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.

# విద్యార్థులకు ట్యాబ్‌లు.. వికలాంగులకు వీల్‌చైర్లు

- **ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలి**
- **వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత**
- **అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు**
- **ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్**

**మహబూబాబాద్ జిల్లా**
**విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్.**



విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ట్యాబ్‌లు, వికలాంగులకు వీల్‌చైర్లను డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న ట్యాబ్‌లను కేవలం వినోదం కోసం కాకుండా విద్యాభ్యాసానికి ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రస్తుత కాలంలో విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో కీలకంగా మారిందని, ట్యాబ్‌ల ద్వారా డిజిటల్ విద్య, ఆన్‌లైన్ అభ్యాసం, వివిధ విద్యా వనరులను అందిపుచ్చుకుని విద్యార్థులు తమ ప్రతిభను మరింతగా పెంచుకోవాలని అన్నారు.

**వికలాంగులకు అండగా ప్రభుత్వం.**

వికలాంగులు ఆత్మవిశ్వాసంతో సమాజంలో ముందుకు సాగేందుకు అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తోందని డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ తెలిపారు. వారి దైనందిన జీవనంలో ఇబ్బందులను తగ్గించేందుకు అవసరమైన సహాయక పరికరాలను అందించడం ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.

**ప్రతి అర్హుడికి సంక్షేమ ఫలాలు.**

విద్యార్థులు, వికలాంగుల సంక్షేమంతో పాటు అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, వికలాంగులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలి




- **సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి**
- **ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్**

**మహబూబాబాద్**
**జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్.**

ఓటర్ల జాబితాల వ్యవహారంలో ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా, పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ సోమవారం మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఎన్నికల కమిషన్ తీరుపై నిరసన వ్యక్తం చేసిన అనంతరం జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ మాట్లాడుతూ SIR ప్రక్రియలో భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ జాబితాల నుంచి తొలగిస్తున్నట్లు వస్తున్న నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల రూపకల్పనలో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాత విధానాన్ని పాటించాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందన్నారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం అవసరమైతే మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రామచంద్రనాయక్ స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు భూక్య ఉమా మురళి నాయక్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణా నదిపై వంతెన.. రెండు రాష్ట్రాల మధ్య వారధి!



- **వంతెన కాదు.. వేలాది కుటుంబాల భవిష్యత్‌కు బాట**
- **రాకపోకలు సులభమైతే ప్రాంతీయ అభివృద్ధికి కొత్త ఊపిరి**

**విశాల భారతి అడవిదేవులపల్లి**

**ప్రత్యేక కథనం**

కృష్ణా నది రెండు రాష్ట్రాలను వేరు చేస్తోంది.. కానీ ఆ నది తీరాల్లో జీవిస్తున్న ప్రజల మనసులను మాత్రం దూరం చేయలేకపోతోంది. నదికి ఇరువైపులా ఉన్న గ్రామాలు, పట్టణాల మధ్య రాకపోకలు, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి అవసరాల కోసం ప్రజలు ఎదురుచూస్తున్న నేపథ్యంలో కృష్ణా నదిపై వంతెన నిర్మాణం అనే ఆలోచనకు ప్రాధాన్యత పెరుగుతోంది. చిత్రంలో ప్రతిపాదించిన విధంగా సత్తెనపల్లి (పల్నాడు) - భద్రంపాడు (తెలంగాణ) మధ్య కృష్ణా నదిపై వంతెన నిర్మాణం జరిగితే రెండు రాష్ట్రాల మధ్య రహదారి అనుసంధానం మరింత మెరుగుపడే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం నదిని దాటేందుకు ప్రజలు చుట్టూ తిరిగి ప్రయాణించాల్సిన పరిస్థితి ఉంటే.. వంతెన అందుబాటులోకి వస్తే ప్రయాణ దూరం, సమయం తగ్గే అవకాశం ఉంటుంది.

**వంతెన వస్తే.. ఎన్నో మార్పులు**

రెండు రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడితే వ్యాపార కార్యకలాపాలు ఊపందుకోవడంతో పాటు రైతులు తమ పంటలను మార్కెట్లకు తరలించేందుకు, ప్రజలు విద్యా, వైద్య అవసరాల కోసం ప్రయాణించేందుకు మరింత సౌకర్యం కలగవచ్చు.

**విద్యార్థులకు విద్యా అవకాశాలు..**
**యువతకు ఉపాధి అవకాశాలు..**
**రైతులకు మెరుగైన మార్కెట్ అనుసంధానం..**
**వ్యాపారులకు కొత్త అవకాశాలు..**
**ప్రజలకు వేగవంతమైన రాకపోకలు..**

ఇలా ఒక వంతెన కేవలం రెండు ప్రాంతాలను కలపడం మాత్రమే కాదు.. రెండు రాష్ట్రాల ప్రజల జీవన విధానాల్లోనూ కొత్త మార్పులకు బాట వేయగలదు.

**వంతెనపై అడుగులు పడాలి..**
**అభివృద్ధికి పరుగులు పెట్టాలి**

కృష్ణా నది మీదుగా ఒక వంతెన నిర్మించాలనే ఆకాంక్ష నెరవేరితే, అది కేవలం కాంక్రీట్ నిర్మాణంగా మిగిలిపోదు. నదికి ఇరువైపులా ఉన్న ప్రజల మధ్య అనుబంధానికి, రవాణా సౌకర్యానికి, ఆర్థిక ప్రగతికి ఒక శాశ్వత వారధిగా నిలిచే అవకాశం ఉంటుంది. ప్రజల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని సాధ్యాసాధ్యాలను పరిశీలించి, సంబంధిత ప్రభుత్వాలు ఈ ప్రతిపాదనపై దృష్టి సారించాలనే ఆకాంక్ష స్థానికంగా వ్యక్తమవుతోంది.

"కృష్ణా నదిపై వంతెన నిర్మిద్దాం..
రెండు రాష్ట్రాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేద్దాం..
వంతెనను కాదు.. రెండు ప్రాంతాల భవిష్యత్‌ను నిర్మిద్దాం!"

**ప్రజల ఆకాంక్ష**
**- రిపోర్టర్ చప్పిడి శ్రవణ్**

# సిద్ధేశ్వర స్వామికి ఘనంగా పల్లకి సేవ

**విశాలభారతి, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఎంతో ప్రసిద్ధిగాంచిన పవిత్రమైన పుణ్యక్షేత్రం శ్రీ నవనాథ సిద్ధుల గుట్ట పైకి సోమవారం రోజు భక్తులు ఉదయం నుండి అధిక సంఖ్యలో విచ్చేసి పంచామృతాలతో బిల్వపత్రాలతో సిద్ధేశ్వరునికి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. కొండ పైన గల రామాలయం, దత్తాత్రేయ స్వామి, దుర్గామాత, అయ్యప్ప స్వామి, ఎల్లమ్మ తల్లి ఆలయాలలో ప్రత్యేకమైన పూజలు నిర్వహించారు. శ్రీనందీశ్వర్ మహారాజు ఆధ్వర్యంలో రామాలయం నుండి పల్లకి సేవ భక్తులు భజన మండలి వారు భక్తి గీతాలు పాడుకుంటూ కోనేరు వద్దకు తీసుకెళ్లి అక్కడ స్వామివారికి అభిషేకం నిర్వహించి హారతి ఇచ్చి తిరిగి రామాలయం వరకు పల్లకి సేవా కార్యక్రమం నిర్వహించారు. గుట్ట పైకి విచ్చేసిన భక్తులందరికీ సిద్ధుల గుట్ట ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.సుమన్, పిసి.గంగారెడ్డి, కోడిగల మల్లయ్య, చరణ్ రెడ్డి, జిమ్మీ రవి, కొంతం మంజుల మురళి, బట్టు శంకర్, చందేశీ శ్రీనివాస్, నరేష్, హజారి సతీష్, ప్రశాంత్ గౌడ్, రామా గౌడ్, సిద్ధుల గుట్ట శివ భక్తులు, భజన మండలి భక్తులందరూ పాల్గొన్నారు.

# వదంతులను నమ్మవద్దు. విద్యార్థుల్లో ఎలుకలు కరిచిన ఆనవాళ్లు లేవు

- **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**





**పాలకుర్తి విశాల భారతి :** మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం సందర్శించి విస్తృతంగా పరిశీలించారు. ఆర్డీఓ కిరణ్ ప్రకాష్‌తో కలిసి విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్.. ఈ నెల 22న విద్యార్థులను ఎలుకలు కరిచినట్లు వచ్చిన సమాచారంపై ఆరా తీశారు. విద్యార్థులను పేర్లు, తల్లిదండ్రుల వివరాలు, స్వస్థలం, ఆరోగ్య పరిస్థితి, భోజనం, జ్వరం వంటి అంశాలపై ప్రశ్నించారు. ఎలుకలు కరిచినట్లు ఎవరైనా చూశారా, ఎప్పుడు జరిగింది, రక్తం వచ్చిందా, నొప్పి ఉందా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల చేతులు, కాళ్లను స్వయంగా పరిశీలించారు. తమకు జ్వరం లేదని, రక్తం రాలేదని, ఆరోగ్యం బాగుందని, భోజనం కూడా బాగానే ఉంటుందని విద్యార్థులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ వదంతులను నమ్మవద్దని, విద్యార్థులను పరిశీలించినప్పుడు ఎలుకలు కరిచినట్లు ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదని తెలిపారు. విద్యార్థుల చేతులు, కాళ్లపై గీతలు కూడా కనిపించలేదని స్పష్టం చేశారు. అనంతరం పాఠశాలలోని భోజన గది, వంటశాల, సరుకుల నిల్వ గది, మరుగుదొడ్లు, మూత్రశాలలు, విద్యార్థుల నిద్రించే గదులు, మంచాలను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన.. పనికిరాని వస్తువులను వెంటనే తొలగించి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డిని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన, శుభ్రమైన పౌష్టికాహారం అందించాలని, తాజా కూరగాయలతో ఆహారం తయారు చేయాలని అధికారులకు సూచించారు. అనుమతి లేకుండా బయటి వ్యక్తులను పాఠశాల ప్రాంగణంలోకి అనుమతించవద్దని స్పష్టం చేశారు ఎంపీడీవో తహసిల్దార్లు పాఠశాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు విద్యార్థులు సమయానుకూలంగా ఆహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ సూచించారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సరస్వతి ఎంపీడీవో వేదవతి వైస్ ప్రిన్సిపల్ వరలక్ష్మి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# జీసీడీఓ గాయత్రిని సస్పెండ్ చేయాలి

- **కేజీబీవీ ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఆరోపణలు**
- **పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్**
- **కలెక్టరేట్ ఎదుట ధర్నా.. అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం**




**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి స్టాఫ్ రిపోర్టర్:** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న జిల్లా కమ్యూనిటీ గర్ల్స్ ఆఫీసర్ (జీసీడీఓ) గాయత్రిపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి, ఆమెను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి పట్ల మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మహబూబాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్ల మధు మాట్లాడుతూ కేజీబీవీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని కోరారు. జీసీడీఓ గాయత్రి వ్యవహారశైలిపై ఉద్యోగులు చేస్తున్న ఫిర్యాదులను ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకుని సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కేజీబీవీలలో పనిచేస్తున్న ఉద్యోగులకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు జిల్లా అదనపు కలెక్టర్ అనిల్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కేజీబీవీ ఉద్యోగుల సమస్యలను పరిశీలించి, జీసీడీఓ గాయత్రిపై పూర్తి స్థాయి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.డి. అమీర్, మహబూబాబాద్ పట్టణ నాయకులు నవీన్, సాయికుమార్, రవికుమార్, అవినాష్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# 11 నెలల చిన్నారికి అరుదైన బ్రెయిన్ సర్జరీ..

- **ప్రాణం పోసిన సికింద్రాబాద్ మెడికవర్ వైద్యులు**



**సికింద్రాబాద్, విశాల భారతి :** సికింద్రాబాద్ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు అరుదైన ఘనత సాధించారు. మెదడు రక్తనాళంలో తీవ్ర సమస్యతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న 11 నెలల పసికందుకు అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి పునర్జన్మనిచ్చారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైద్య బృందం వెల్లడించింది. బాధితురాలైన చిన్నారి తీవ్రమైన జ్వరం, ఫిట్స్‌తో ఆసుపత్రికి వచ్చింది. వైద్యులు క్షుణ్ణంగా పరీక్షించగా, మెదడులోని యాంటీరియర్ సెరిబ్రల్ ఆర్టరీ (ACA)కి చెందిన రైట్ A2 విభాగంలో రక్తనాళం గోడ బలహీనపడి ఉబ్బిపోయినట్లు (అన్యూరిజం) గుర్తించారు. శిశువుల్లో రక్త పరిమాణం చాలా తక్కువగా ఉండటం, రక్తనాళాలు సూక్ష్మంగా ఉండటం వల్ల క్యాథెటర్ ఆధారిత మినీమల్లీ ఇన్వేసివ్ విధానం వీలుపడలేదు. దీంతో ఓపెన్ సర్జరీ చేయాలని వైద్యులు నిర్ణయించారు. ప్రధాన రక్తనాళాన్ని మూసివేయకుండా, మెదడుకు రక్తప్రసరణ కొనసాగేలా చేయడమే లక్ష్యంగా న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ ఎస్. రమేష్ నేతృత్వంలోని బృందం రంగంలోకి దిగింది. చిన్నారికి క్రానియోటమీ నిర్వహించి, మైక్రోసర్జికల్ క్లిప్పింగ్, రీకన్‌స్ట్రక్షన్ విధానాల ద్వారా ఉబ్బిన రక్తనాళాన్ని సరిచేశారు. దీనికి తోడు మెదడుకు రక్తప్రసరణ మరింత మెరుగుపడేందుకు EDAMS ప్రక్రియను కూడా విజయవంతంగా పూర్తి చేశారు. ఈ క్లిష్టమైన ఆపరేషన్‌లో నియోనటాలజిస్ట్ డాక్టర్ దీపా ధరనప్ప షెట్టి ప్రత్యేక పీడియాట్రిక్ కేర్ అందించగా, అనస్థీషియా హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కె. ప్రదీప్ చిన్నారి ప్రాణాధార వ్యవస్థలు స్థిరంగా ఉండేలా పర్యవేక్షించారు. శస్త్రచికిత్స అనంతరం వెంటిలేటర్ సాయం లేకుండానే చిన్నారి పూర్తిగా కోలుకోవడంతో, స్థిరమైన ఆరోగ్య స్థితిలో డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు. చిన్న వయసులో ఇలాంటి అరుదైన కేసుల్లో మల్టీ డిసిప్లినరీ వైద్యుల సమన్వయం, అధునాతన మైక్రోసర్జికల్ నైపుణ్యాలే చిన్నారిని కాపాడగలిగాయని డాక్టర్ ఎస్. రమేష్ పేర్కొన్నారు. తమ పాప పూర్తి ఆరోగ్యంతో ఇంటికి చేరడంతో చిన్నారి తల్లిదండ్రులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# 380 మంది పేద లబ్ధిదారుల హక్కులను కాపాడాలి

- నవభారత్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపుపై లబ్ధిదారుల ఆవేదన
- పాత జాబితాను పక్కనపెట్టి కొత్త డ్రా ఎందుకు? – కాంపెల్లి కనకేష్ పటేల్

**పాల్వంచ విశాల భారతి:**




పాల్వంచ పట్టణంలోని నవభారత్ ప్రాంతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు వ్యవహారంలో గతంలో అధికారికంగా ఎంపికైన 380 మంది పేద లబ్ధిదారుల హక్కులను పరిరక్షించాలని పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షులు కాంపెల్లి కనకేష్‌పటేల్ డిమాండ్ చేశారు. సంవత్సరాలుగా ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలను పక్కనపెట్టి కొత్తగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టడం సరికాదని ఆయన అన్నారు. 2023లో పాల్వంచ పట్టణంలోని పాత 24 వార్డుల పరిధిలో 1,976 మంది అర్హులను పరిశీలించిన అనంతరం, అప్పటి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, రెవెన్యూ అధికారుల సమక్షంలో పాత ఆర్డీవో కార్యాలయంలో బహిరంగంగా డ్రా నిర్వహించి 380 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి స్లిప్పులు అందజేశారని తెలిపారు. వారి పేర్లను తహసీల్దార్ కార్యాలయ నోటీస్ బోర్డులో కూడా ప్రదర్శించారని పేర్కొన్నారు.

**లబ్ధిదారుల ప్రధాన డిమాండ్లు**

గతంలో అధికారికంగా ఎంపిక చేసిన 380 మంది లబ్ధిదారుల జాబితాను రద్దు చేసినట్లు ఎలాంటి అధికారిక ప్రకటన చేయకుండా కొత్తగా మరో డ్రా నిర్వహించడంపై స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. 2023లో ఎంపికైన 380 మంది లబ్ధిదారుల జాబితాను అధికారికంగా ఎందుకు రద్దు చేశారో వెల్లడించాలి. పాత లబ్ధిదారులకు ఇచ్చిన స్లిప్పులు, అధికారిక ఎంపికకు ఉన్న ప్రామాణికతపై అధికారులు స్పష్టత ఇవ్వాలి. ఇటీవల నిర్వహించిన 360 మంది కొత్త డ్రా ప్రక్రియను నిలిపివేసి, మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలి. గతంలో ఎంపికైన వారిలో ఎవరైనా అనర్హులు ఉంటే వ్యక్తిగతంగా విచారణ చేసి, అనర్హులను మాత్రమే తొలగించాలి. 380 మంది పాత లబ్ధిదారుల అర్హతలను మరోసారి పారదర్శకంగా పరిశీలించి, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు కేటాయించాలి. నవభారత్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మొత్తం సంఖ్యను, ఇప్పటికే కేటాయించిన ఇళ్ల వివరాలను అధికారులు బహిర్గతం చేయాలి. 380 మంది పాత లబ్ధిదారులకు, 360 మంది కొత్తగా ఎంపికైన వారికి ఇళ్లు ఎలా కేటాయిస్తారో స్పష్టమైన లెక్కలు వెల్లడించాలి. ఇళ్ల నిర్మాణం, కేటాయింపు, లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలి.

**మూడేళ్లుగా ఎదురుచూపులు**

2023లో ఎంపికైనప్పటి నుంచి ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ఇప్పటివరకు ఇళ్లు అందకపోవడంతో తీవ్ర నిరాశ నెలకొందని కనకేష్ పటేల్ అన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తికాకపోవడంతో ఇప్పటికే ఎన్నో కుటుంబాలు అద్దె ఇళ్లలో, తాత్కాలిక నివాసాల్లో ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణం, కేటాయింపులపై చర్యలు తీసుకోవాల్సిన సమయంలో కొత్తగా 360 మందికి డ్రా నిర్వహించడం వల్ల పాత లబ్ధిదారుల్లో అనుమానాలు నెలకొన్నాయని అన్నారు. "అధికారులు, ప్రజాప్రతినిధులు మారిన ప్రతిసారీ పేదల లబ్ధిదారుల జాబితాలు మారకూడదు. అర్హతే ప్రామాణికంగా ఉండాలి" అని పేర్కొన్నారు.

**అధికారులు సమాధానం చెప్పాలి**


నవభారత్ ప్రాంతంలో వాస్తవంగా ఎన్ని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించారు? వాటిలో ఎన్ని ఇళ్లు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నాయి? 380 మంది పాత లబ్ధిదారులకు, తాజాగా ఎంపిక చేసిన 360 మందికి ఇళ్ల కేటాయింపు ఎలా జరుగుతుంది? అనే అంశాలపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సమగ్రంగా వివరించాలని డిమాండ్ చేశారు. గతంలో ఎంపికైన 380 మందిలో ఎవరైనా అనర్హులు ఉంటే నిబంధనల ప్రకారం విచారణ జరిపి, అర్హులైన పేద కుటుంబాలకు మాత్రమే ఇళ్లు అందించాలని కోరారు. మొత్తం పాత జాబితాను పక్కనపెట్టి కొత్తగా ఎంపిక చేయడం వల్ల నిజమైన పేదలు నష్టపోయే పరిస్థితి రాకూడదని అన్నారు.

**న్యాయపోరాటానికి సిద్ధం**

380 మంది పాత లబ్ధిదారులకు న్యాయం జరిగేలా స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి స్పష్టమైన హామీ ఇవ్వాలని కాంపెల్లి కనకేష్ పటేల్ డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే బాధిత లబ్ధిదారులను ఏకం చేసి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి న్యాయ పోరాటం చేపడతామని తెలిపారు. అవసరమైతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మారుమాళ్ల కిరణ్, పూజల ప్రసాద్, కాంపెల్లి నవీన్, గుగులోతు శ్యామ్ కుమార్, కాంపెల్లి భార్గవ్ నితీష్, కదలి రామకృష్ణ, గజేంద్రుల వెంకట్ పాల్గొన్నారు.

## పంచాయతీల పనితీరుపై అధికారుల నజర్

- నేడు మండల ప్రజా పరిషత్ సమావేశం.. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష




**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** గ్రామ పంచాయతీల అభివృద్ధి కార్యక్రమాల అమలు, సంక్షేమ పథకాల పురోగతిపై సమీక్షకు అధికారులు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి 45 రోజులకు ఒకసారి నిర్వహించే మండల ప్రజా పరిషత్ సమావేశాన్ని నేడు మంగళవారం (29092026) మధ్యాహ్నం 3 గంటలకు అబ్దుల్లాపూర్‌మెట్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీవాణి తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె సూచించారు. గ్రామ పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల సంక్షేమ పథకాల అమలు తీరుపై సమావేశంలో సమీక్షించనున్నారు. అదేవిధంగా సర్పంచుల చట్టబద్ధమైన విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించడం, గ్రామ పంచాయతీ అధికారులు-మండల స్థాయి అధికారుల మధ్య సమన్వయాన్ని మరింత పెంపొందించడం, ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంపై చర్చించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. అన్ని సంబంధిత శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన పురోగతి నివేదికలతో నిర్ణీత సమయానికి సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని శ్రీవాణి కోరారు.

## ఆయిల్ ఫెడ్ భూముల ప్రైవేటీకరణను అడ్డుకోవాలి

- జీవో 85ను రద్దు చేయాలి: ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



**ముషీరాబాద్, విశాల భారతి:** ఆయిల్ ఫెడ్ భూముల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ పిలుపునిచ్చారు. ఆర్టీసీ క్రాస్ రోడ్ లో 500 కోట్ల అత్యంత విలువగల 16 వేల గజాల స్థలాన్ని 80 కోట్లకే రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్ట బెడుతున్నారని ఆరోపించారు. సోమవారం ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని ఆయిల్ ఫెడ్ భూములను అంబర్పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఆయిల్ ఫెడ్ మాజీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, ముఠా జై సింహ, తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి సాగర్ తో కలిసి దాసోజు శ్రవణ్ పరిశీలించి మాట్లాడారు.ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ లోని బస్ భవన్ ఎదురుగా ఉన్న సుమారు 16 వేల గజాల ఆయిల్ ఫెడ్ భూమిని సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేశారు.2026 మే 22న జారీ చేసిన జీవో 85 ద్వారా మళ్లీ ప్రైవేటు వ్యక్తులకు ప్రయోజనం చేకూర్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 3.5 లక్షల ఎకరాల్లో 88 వేల మంది రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్నారన్న విషయాన్ని ప్రభుత్వం గ్రహించాలని సూచించారు. జీవోను పూర్తిగా రద్దు చేసి ఆయిల్ ఫెడ్ కు జీవో మరల ఇచ్చేవరకు ఫామ్ ఆయిల్ రైతులు ప్రజలు పోరాటం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముచ్చ కుర్తి ప్రభాకర్, సోమన్, శ్రీనివాస్ రెడ్డి, శివ ముదిరాజ్, రోషం మల్లేష్, నేత శ్రీనివాస్, రైతు సంఘం ప్రతినిధులు జగ్గారెడ్డి, మూడ్ శోభన్, ఉడుత రవీందర్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## జీ స్కూల్ చౌరస్తాలో చెత్త కుప్పలు.. అధికారుల నిర్లక్ష్యమే కారణం!

- విద్యార్థులు, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా?

డంపింగ్ స్పాట్‌ను వెంటనే తొలగించాలి : సామతిరుమల రెడ్డి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** హయత్‌నగర్ డివిజన్‌లోని జీ స్కూల్ చౌరస్తా వద్ద చెత్త డంపింగ్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ సామతిరుమల రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ చెత్త సేకరణ పేరుతో ఏర్పాటు చేసిన డంపింగ్ స్పాట్ కాస్తా చుట్టుపక్కల ప్రాంతాల చెత్తకు అడ్డాగా మారిందని ఆయన మండిపడ్డారు. చుట్టుపక్కల నివాసితులు పెద్దఎత్తున చెత్తను అక్కడే వేస్తుండటంతో భారీగా చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయని తెలిపారు. దుర్వాసనతో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీధి కుక్కలు, ఇతర జంతువులు చెత్తను రోడ్లపైకి ఈడ్చుకెళ్లడంతో పరిసరాలు మరింత అపరిశుభ్రంగా మారుతున్నాయని అన్నారు. పాఠశాల సమీపంలోనే చెత్త డంపింగ్ కొనసాగడం ఎంతవరకు సమంజసం? అని ప్రశ్నించిన సామతిరుమల రెడ్డి.. విద్యార్థులు, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని మాల్కాజిగిరి మున్సిపల్ అధికారులు, పారిశుధ్య విభాగం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. జీ స్కూల్ చౌరస్తా వద్ద ఉన్న డంపింగ్ స్పాట్‌ను వెంటనే తొలగించి, ప్రత్యామ్నాయంగా శాస్త్రీయ పద్ధతిలో చెత్త సేకరణకు శాశ్వత వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యను తాత్కాలికంగా పరిష్కరించి చేతులు దులుపుకోకుండా, చెత్త పేరుకుపోకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆయన సూచించారు. "స్వచ్ఛతే నా లక్ష్యం.. పరిశుభ్రతే నా ఆశయం. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే చెత్త డంపింగ్ సమస్యను అధికారులు ఇకనైనా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలి" అని సామతిరుమల రెడ్డి స్పష్టం చేశారు.

## డ్రైనేజీ ట్రంక్ లైన్‌కు మోక్షం!

- నిలిచిన పనులకు మళ్లీ కదలిక.. క్షేత్రస్థాయిలో పరిశీలించిన కళ్లెం నవజీవన్ రెడ్డి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** హయత్‌నగర్ డివిజన్‌లోని జైస్వాల్ ఫర్నిచర్ నుంచి మనుగనూర్ కల్వర్ట్ వరకు చేపట్టిన భూగర్భ డ్రైనేజీ ట్రంక్ లైన్ నిర్మాణ పనులకు మళ్లీ కదలిక వచ్చింది. గతంలో అనివార్య కారణాలతో మధ్యలో నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించనున్న నేపథ్యంలో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి జలమండలి అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. డ్రైనేజీ ట్రంక్ లైన్‌కు సంబంధించిన లెవెల్స్, పనుల పరిస్థితి, సాంకేతిక అంశాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ ట్రంక్ లైన్ నిర్మాణం పూర్తయితే ఆయా ప్రాంతాల ప్రజలకు దీర్ఘకాలంగా ఎదురవుతున్న డ్రైనేజీ సమస్యలకు గణనీయమైన ఉపశమనం లభిస్తుందని తెలిపారు. నిలిచిపోయిన పనులను వెంటనే పునఃప్రారంభించి, ఎలాంటి జాప్యం లేకుండా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం నాగరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## స్ట్రెంత్ జిమ్ రెండో వార్షికోత్సవం ఘనంగా

**విశాల భారతి, సెప్టెంబర్. 28:** పాల్వంచ స్ట్రెంత్ జిమ్ రెండో వార్షికోత్సవ వేడుకలను జిమ్ ఓనర్, ట్రైనర్ నవీన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిమ్ సభ్యులు, సిబ్బంది సమక్షంలో కేక్ కట్ చేసి వార్షికోత్సవ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. రెండేళ్లుగా స్ట్రెంత్ జిమ్ ద్వారా యువతలో ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్న నవీన్‌ను పలువురు అభినందించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని జిమ్ సిబ్బందికి ప్రత్యేకంగా టీషర్టులను పంపిణీ చేశారు. అలాగే జిమ్‌లో సభ్యులు, సిబ్బందిలో ఉత్సాహాన్ని పెంపొందించేలా పలు కాంపిటీషన్లు, గేమ్స్ నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన వారికి ప్రత్యేకంగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జిమ్ ఓనర్, ట్రైనర్ నవీన్ ప్రతి ఒక్కరినీ ప్రోత్సహిస్తూ, ఫిట్‌నెస్‌తో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆరోగ్యకరమైన జీవనశైలిపై మోటివేట్ చేశారు. రెండో వార్షికోత్సవ వేడుకల సందర్భంగా జిమ్ సిబ్బంది, సభ్యులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు. కేక్ కటింగ్, పోటీలు, గేమ్స్, బహుమతుల ప్రదానం తదితర కార్యక్రమాలతో స్ట్రెంత్ జిమ్‌లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో స్ట్రెంత్ జిమ్ సిబ్బంది, సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొని వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేశారు. జిమ్ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ నవీన్ కృతజ్ఞతలు తెలిపారు.



## పోలీస్ క్రీడా పండుగకు ఘన శ్రీకారం క్లస్టర్‌సి పోటీలను ప్రారంభించిన అభిలాష బిస్త్ ఐపీఎస్



**రాజేంద్రనగర్,విశాల భారతి :**

పోలీస్ శాఖలో క్రీడాస్ఫూర్తి, శారీరక దృఢత్వం, ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న 5వ తెలంగాణ పోలీస్ క్రీడలు-2026లో భాగంగా క్లస్టర్-సి పోటీలు సోమవారం ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్ విభాగాల్లో సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి. అకాడమీ క్రీడా భవన్‌లో బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహిస్తుండగా, లాన్ టెన్నిస్ పోటీలు వట్టినాగులపల్లిలో జరుగుతున్నాయి. అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ ఐపీఎస్ క్రీడాకారులతో కలిసి బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్ ఆడి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించిన ఆమె, క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు. విధి నిర్వహణలో నిరంతరం ఒత్తిడితో పనిచేసే పోలీస్ సిబ్బందికి క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసం, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని అధికారులు పేర్కొన్నారు. క్లస్టర్-సి పోటీల్లో రాష్ట్రంలోని వివిధ పోలీస్ యూనిట్ల నుంచి కానిస్టేబుల్ స్థాయి నుంచి ఐపీఎస్ అధికారుల వరకు 700 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారు. వివిధ హోదాల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది ఒకే వేదికపై క్రీడాకారులుగా పాల్గొనడం ఈ పోటీల ప్రత్యేకతగా నిలిచింది. తెలంగాణ స్పోర్ట్స్ ఐజీ డాక్టర్ గజారావు భూపాల్ పర్యవేక్షణలో, స్పోర్ట్స్ డీఎస్పీ డాక్టర్ ఎన్.వి. వెంకటేశ్వర్లు సమన్వయంతో పోటీలకు సంబంధించిన డ్రాలు, క్రీడాకారుల జాబితా, ఇతర ఏర్పాట్లు పూర్తిచేశారు. అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు ఓవరాల్ ఇన్‌చార్జిగా, ఔట్‌డోర్ అసిస్టెంట్ డైరెక్టర్ యార్లగడ్డ రాంబాబు నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. లాన్ టెన్నిస్‌కు డీఎస్పీ తిరుపతి, బ్యాడ్మింటన్‌కు జి. జగదీశ్వరరావు, టేబుల్ టెన్నిస్‌కు డీఎస్పీ శ్రీరాములు ఇన్‌చార్జిలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. క్రీడాకారులకు వసతి, భోజనం, మౌలిక వసతులు, క్రీడా ప్రాంగణాలు తదితర ఏర్పాట్లను అకాడమీ అధికారులు సమన్వయంతో పూర్తి చేశారు. పోటీల నిర్వహణను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, ఔట్‌డోర్ డీఎస్పీ తోట శ్రీనివాసులకు బాధ్యతలు అప్పగించారు. అకాడమీలో శిక్షణ పొందుతున్న ఐదుగురు ప్రొబేషనరీ డీఎస్పీలు మనీష్, సాయికిరణ్, లతేఫా ఆషా, నేహా పురోహిత్, ప్రవీణ్ సైతం పోటీల్లో పాల్గొంటున్నారు. బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్‌లో వారు తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. విధి నిర్వహణతో పాటు క్రీడలు, శారీరక దృఢత్వానికి పోలీస్ అకాడమీ ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శనమని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ ఐపీఎస్, డిప్యూటీ డైరెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ డైరెక్టర్ వేముల శ్రీనివాసరావు, స్పోర్ట్స్ డీఎస్పీ డాక్టర్ ఎన్.వి. వెంకటేశ్వర్లు, డీఎస్పీ ఆదూరి శ్రీనివాసరావు, వివిధ క్రీడల ఇన్‌చార్జి అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలతో పోలీస్ సిబ్బందిలో ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఐక్యత, స్నేహభావం మరింత బలోపేతం అవుతాయని అధికారులు తెలిపారు.

## నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**నాచారం 28 విశాల భారతి**



నగరంలో మాదకద్రవ్యాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు.మల్లాపూర్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతూ గంజాయి విక్రయిస్తున్న ముకేష్ చౌహాన్ అనే వ్యక్తిని నాచారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి 14 చిన్న ప్యాకెట్లలో ఉన్న 70 గ్రాముల గంజాయి, ఒక మొబైల్ ఫోన్, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై NDPS (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్) చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్ కు తరలించారు.

## బిజెపి ఓబీసీ మోర్చా జనరల్ సెక్రెటరీగా మోదుగుల సురేష్ కుమార్



**ముషీరాబాద్ విశాల భారతి:** బిజెపి ఓబీసీ మోర్చా సికింద్రాబాద్ మహంకాళి జిల్లా జనరల్ సెక్రటరీగా మోదుగుల సురేష్ కుమార్ నియమితులయ్యారు. బిజెపి, బిజెవైఎం లో వివిధ హోదాల్లో పని చేసిన సురేష్‌కుమార్ ను గుర్తించిన జిల్లా కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకొని ప్రకటించింది. పార్టీ చేపట్టిన ప్రతి కార్యక్రమానికి హాజరై పార్టీ బలోపేతానికి ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని సురేష్ కుమార్ తెలిపారు. జిహెచ్ఎంసి ఎన్నికల్లో పార్టీ జెండా ఎగిరే విధంగా అందరితో కలిసి పని చేస్తానని స్పష్టం చేశారు. తనకి ఈ అవకాశం కల్పించినందుకు ఎంపీ డాక్టర్ కే లక్ష్మణ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు భరత్ గౌడ్, ఓ బి సి ప్రెసిడెంట్ వై సురేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజావాణిలో ఒక దరఖాస్తు స్వీకరణ

- 13 మంది అధికారులు హాజరు.. సమస్యల పరిష్కారానికి చర్యలు




**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఒక దరఖాస్తును అధికారులు స్వీకరించారు. అందిన దరఖాస్తును సంబంధిత శాఖకు పంపించి, నిబంధనల ప్రకారం సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి యు. శ్రీవాణి తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి మండలంలోని వివిధ శాఖలకు చెందిన 13 మంది అధికారులు హాజరై ప్రజల నుంచి సమస్యలను స్వీకరించారు. అందిన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించినట్లు ఎంపీడీవో యు. శ్రీవాణి పేర్కొన్నారు.

## భగత్‌సింగ్ ఆశయాలే యువతకు స్ఫూర్తి

- 119వ జయంతి సందర్భంగా విప్లవ వీరుడికి ఘన నివాళులు



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** బ్రిటిష్ పాలనకు ఎదురొడ్డి దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికంబాన్నే చిరునవ్వుతో ఆహ్వానించిన విప్లవ వీరుడు భగత్‌సింగ్ 119వ జయంతి సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఆయనకు ఘన నివాళులు అర్పించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించిన నాయకులు, ఆయన త్యాగం, పోరాట స్ఫూర్తి, సమానత్వం కోసం సాగించిన ఉద్యమాన్ని స్మరించుకున్నారు. దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని భగత్‌సింగ్ ఆశయాలు నేటి యువతలో పోరాట స్ఫూర్తిని రగిలించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్ తన యౌవనాన్ని, జీవితాన్ని త్యాగం చేశారని అన్నారు. ఆయన ధైర్యం, త్యాగం, ఆశయాలు నేటి యువతకు నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని పేర్కొన్నారు. "ఇంక్విలాబ్ జిందాబాద్" అనే నినాదంతో సామాజిక న్యాయం, సమానత్వం కోసం పోరాడిన భగత్‌సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాదిరెడ్డి, సీపీఐ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్, సీపీఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు తగిలి మధు, గిరిజన సమైక్య తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బానోత్ బిచ్చు నాయక్, ఏఐవైఎఫ్ అబ్దుల్లాపూర్‌మెట్ మండల ప్రధాన కార్యదర్శి నిమ్మాల గణేష్, మండల అధ్యక్షులు శోభన్ బాబు, కోశాధికారి అశోక్, ప్రవీణ్, శ్రీను నాయక్, ఆవుల యాదగిరి, కుమార్, అలివేలు, వడిత్య ప్రియా, కావేరి, అన్నపూర్ణ, సంధ్య, చంద్రకళ, రేణుక, దేవి, లలిత తదితరులు పాల్గొన్నారు. యువకులు, యువతులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఘనంగా గణేష్ నవరాత్రులు.. రూ.1,45,000 పలికిన లడ్డు



**చౌటుప్పల్, విశాల విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని శ్రీకంఠమహేశ్వర కాలనీలో శ్రీరామ్ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలో లడ్డూ ఏకంగా రూ. 1,45,000* పలికింది. భక్తుల మధ్య ఉత్కంఠగా సాగిన వేలం పాటలో చౌటుప్పల్ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు *సందగల్ల విజయ్ సతీష్ గౌడ్ లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా యువసేన సభ్యులు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా కాలనీలో ఐక్యతతో వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. లడ్డూ వేలం ద్వారా వచ్చిన నిధులను ఆలయ అభివృద్ధికి, సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, యువసేన సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నటి రకూల్ ప్రీత్ సింగ్

## ఇంట్లో ఐటీశాఖ
# సోదాలు

బాలీవుడ్ నటి రకూల్ ప్రీత్ సింగ్‌తో పాటు ఆమె మామ, ఫిల్మ్ ప్రొడ్యూసర్ వాసు భగ్నాని, పనోరమా స్టూడియోస్‌తో పాటు మొత్తం 12 ప్రదేశాల్లో ఇవాళ ఆదాయపు పన్ను శాఖ తనిఖీలు నిర్వహిస్తున్నది. నిధుల తరలింపులో అక్రమాలు చోటుచేసుకున్న కోణంలో ముంబై ఇన్‌కం ట్యాక్స్ శాఖ ఈ సోదాలు చేపడుతున్నది. ఫిల్మ్ ప్రాజెక్టులకు ఫైనాన్సింగ్ పేరుతో విదేశాలకు నిధులు మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ముంబై ఐటీశాఖకు చెందిన పలు బృందాలు.. ఇవాళ ఈ కేసులో డాక్యుమెంట్లు, ఫైనాన్షియల్ రికార్డులను పరిశీలిస్తున్నాయి. ఓవర్‌సీస్ లావాదేవీల గురించి కూడా ఐటీశాఖ ఆరా తీస్తున్నది. గత ఏడాది డిసెంబర్‌లో రకూల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్ ప్రీత్ సింగ్ కోసం ఓ డ్రగ్ కేసులో పోలీసులు గాలింపు చేపట్టిన విషయం తెలిసిందే. 2025, డిసెంబర్ 19వ తేదీన డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం పోలీసులు ఇద్దరు వ్యాపారులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 43 గ్రాముల కొకైన్, 11.5 గ్రాములు ఎండీఎంఏను సీజ్ చేశారు.

అయితే ఈ కేసులో ఆ ఇద్దరు పెడ్లర్ల నుంచి అమన్ అయిదు సార్లు డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు అనుమానాలు ఉన్నాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.